# సత్యవాక్యు

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

AUGUST 1997

# సంక్షిప్త వార్తలు

1997 జూలై నెల 11 నుండి 16 వరకు అమెరికా నుండి వచ్చిన సోదరులు బాబ్ బెరార్డ్ గారు పలు ప్రాంతములలో సువార్త నందించుటలో సహాయపడిరి. జూలై 13వ తేదీ ఆదివారము నాడు పుల్లేటికుర్రు కొల్లివారిపేట సంఘమును దర్శించి అక్కడ వాక్య పరిచర్య చేసిరి. జూలై 14,15,16 తేదీలలో స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ నందు వాక్యపరిచర్య చేసి విద్యార్ధులకు బైబిలులోని లాజిక్‌ను గూర్చి బోధించిరి. 16వ తేదీ మధ్యాహ్నం నుండి విమానములో ఆఫ్రికా మీదుగా పయనించి స్వదేశమునకు చేరుకొనిరి. సోదరులు బాబ్ బెరార్డ్ గారు గత సంవత్సరం సోదరులు ఐరా రైస్ గారితో మన దేశమునకు వచ్చి తుఫాను బాధితులకు కొన్ని ప్రాంతములలో సహాయమందించిరి.

## బెయిలీగారి సతీమణి మృతి

1997 జూలై 25వ తేదీ శుక్రవారం భారతకాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు జె.సీ. బెయిలీ గారి సతీమణి మిర్టల్ బెయిలీ గారు కెనడాలో ప్రభువునందు నిద్రించిరి. ఆమె వయస్సు 91 సంవత్సరములు. 28వ తేదీనాడు ఆమె భూస్థాపన కెనడాలో ఘనముగా జరిగెను. బెయిలీ గారి సతీమణి మొదట్లో బెయిలీ గారితో భారతదేశమునకు వచ్చి ఆయన చేయుచున్న గొప్ప సువార్తపనికి గొప్ప ప్రోత్సాహము నిచ్చిరి. భారతదేశములో సువార్త పనిలో ఆమె అనేక శ్రమలను, అసౌకర్యములను ఓరిమితో అనుభవించిరి. అనేక స్త్రీలకు చక్కటి తర్ఫీదు నిచ్చిరి. ఆమె నిజముగా ధన్యురాలు. తన భర్తతో కలిసి భారతదేశములో ప్రారంభించిన క్రీస్తుసంఘ పని క్రీస్తు వారు మరలా వచ్చువరకు నమ్మకముగా నిలిచి యుండునట్లు ప్రార్ధించుదాం. మీ సానుభూతిని తెలుపుచు వయోవృద్ధులైన బెయిలీ గారికి ఉత్తరము వ్రాయండి. ఆయన వయస్సు 94 సంవత్సరములు.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 | ఆగష్టు 1997 | సంచిక 1

## సంపాద కీయం

## క్రైస్తవారాధన

( Christian Worship )

ఆరాధనలన్నిటిలోను క్రైస్తవారాధన ప్రాముఖ్యమైనది. క్రైస్తవారాధన అంటే క్రొత్తనిబంధన గ్రంథములో దేవుడు నిర్దేశించిన ఆరాధనయని నా ఉద్దేశం. దానిని బట్టియే క్రైస్తవుడు నేడు దేవుని నారాధించాలి. ఆరాధన అనే ఈ మాట రెండు వందల మారులుపైగా బైబిలులో మనకు కనబడతాది. ప్రతి యుగములోను దేవుడు మానవుని నుండి ఆరాధన కోరాడు. అయితే ఆయారాధన ఎట్లు చేయాలో అను సంగతి ఆయన మానవునికి వదిలేసేయలేదు సరిగదా ఆయన కోరు ఆరాధనను గూర్చి దేవుడు వివరాలిచ్చాడు. నేటి మతప్రపంచాన్ని మనం చూస్తే మానవులు పలువిధాలుగా దేవుని నారాధించుచున్నారు. అది వారు స్వయంగా కల్పించుకొన్న క్రమముగాని దేవుని మాటలను బట్టి యున్నట్టిది కాదు. అట్టిది స్వేచ్ఛారాధన అవుతాది. అది దేవుని దృష్టిలో వ్యర్థం.

మానవులెట్లు దేవుని నారాధించాలో ఆయన మొదటినుండి చెబుతూనే

వచ్చాడు. ఉదాహరణకు మొదటి కుమారులైన కయీను, హేబెలులకు ఆయన నారాధించే విధానాన్ని తెలియజేసాడు. వీరు చేసిన ఆరాధనను గూర్చి ఆదికాండము 4:3-5 వచనాల్లో మనం చదువగలము: కొంతకాలమైన తరువాత కయీను పొలముపంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలుకూడ తనమందలో తొలుచూలు పుట్టినవాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను. కయీనును అతని అర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు.

తన సొంత తెలివి నుపయోగించి దేవుని నారాధించాలని ప్రయత్నించిన వానిగ కయీను మనకు కనబడుచున్నాడు. దేవునికి ఏదిబడితే దానిని అర్పణగా అర్పించేయొచ్చని అతడు తలంచియుంటాడు. అయితే దేవుడతని అర్పణను అంగీకరించలేదు. దీనిని బట్టి ఆయన అంగీకరించేది యేమిటో వారికి తెలియ జేసాడని మనం గ్రహించుకోవచ్చును. హెబ్రీ 11:4లో విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటే శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెనని దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చునపుడు అతడు విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు అని వ్రాయబడి యుండుట మనము చూడగలము. రోమా 10:17లో చూస్తే దేవుని వాక్యము వినుటద్వారా విశ్వాసము కలుగునని గ్రహించగలము. హేబెలు దేవుని మాటలు విన్నాడు. కయీను వినడానికి నిరాకరించాడు. దేవుడు హేబెలు అర్పణల నంగీకరించాడు. కయీను అర్పణలను నిరాకరించాడు.

## ఆరాధన తీవ్రమైనది

క్రైస్తవారాధనయనే అతి ప్రాముఖ్యమైన అంశాన్ని మనం ఇప్పుడు గమనించు చున్నాము. ఈయారాధనలో మనలను నడింపించుటకొక మార్గదర్శి క్రొత్తనిబంధన గ్రంధము ఈయబడియున్నది. నేడు మనం చేయు ఆరాధనను దేవుడంగీక రించాలంటే మనం ఈ గ్రంధము చొప్పున ఆరాధించాలి. ఒక సందర్భములో క్రీస్తు ప్రభువు ఇట్లు చెప్పారు: "దేవుడు ఆత్మగనుక ఆయన నారాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను (యోహాను 4:24). మన ఆరాధన

అంగీకరింపబడాలంటే అది రెండు ముఖ్యాంశములపై ఆధారపడియున్నది. అది ఆత్మతోకూడినట్టిదై యుండాలి. నేటికాలపు ఆరాధన చాలమట్టుకు విలువలేనిదే. అది దేవుని సత్యముపై ఆధారపడినట్టిదికాదు. ఆరాధన తీవ్రమైన సంగతి దానిని మనం తీవ్రముగానే పరిగణించాలి. ఆరాధనలో మనం నిద్రపోయినా నవ్వుతూ కబుర్లాడు కొంటూ కాలం గడుపుచున్నా పరలోకమందున్న దేవుని మాత్రం ఆరాధించడంలేదు.

ప్రపంచములో నేడు విగ్రహారాధన ఎక్కువ యున్నది. కొందరికి తమవినోదమే ఒక విగ్రహం. వారి లేఖనాన్ని ధ్యానించాలి: "ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి, ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో యుండదు. లోకములో ఉన్నదంతయు అనగా శరీరాశయు నేత్రాశయు జీవపు డంబమును తండ్రివలన పుట్టినవి కావు. అవిలోకసంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించి పోవుచున్నవిగాని దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును" (1యోహా 2:15-17). కొందరు ఫేషన్లను ఆరాధిస్తారు. అయితే ఈలోకపునటన గతించుచున్నది యని లేఖనము చెప్పుచున్నది (1కొరింథీ 7:31). మరికొందరు ధనాన్ని ఆరాధిస్తారు. యేసు ఇట్లనుచున్నారు: ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా యుండనేరడు అతడు ఒకని ద్వేషించి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు (మత్తయి 6:24). మీరు ఫలానా సంగతి చేయనేరరని యేసుక్రీస్తు చెప్పుచున్నపుడు దాన్ని చేయకుండుట శ్రేష్టం.

ఆరాధనను గూర్చి చెప్పుకొనుచున్నపుడు అనేకులనుద్దేశించి యేసు చెప్పిన ఈ మాటలను చెప్పుకోకుండ యుండలేము: ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు (మత్తయి 15:9). యిలా ఆరాధించేవారు ఈనాడు ఎంతమంది లేరు?

## ఆదిమ క్రైస్తవుల ఆరాధన

లేఖనములలో వ్రాయబడిన రీతిగా మనం ఆరాధించకపోతే మన ఆరాధన వ్యర్థం. ఆరాధించినపుడు ఆదిమ క్రైస్తవులు యేమి చేసారు ? ఆరాధించేటపుడు క్రైస్తవులు నేడు ఏమి చేస్తారు? అంగీకారయోగ్యమైన ఆరాధనకు ఆదిమ క్రైస్తవులు ఏమి చేసారో దాన్నే మనం కూడ చేయాలి. ఈ సంగతిని ఆలోచించడం మనకు శ్రేయస్కరం. వారి ఆరాధనాంశములను ఇక్కడ మనం చెప్పుకోవడము మంచిదే.

క్రైస్తవులు పాటలు పాడాలని క్రొత్తనిబంధన బోధించుచున్నది (1కొరింథీ 14:15; ఎఫెసీ 5:19; కొలస్స 3:16; రోమా 15:9). ఆదిమ క్రైస్తవులు ఆ పనినే చేసారు. క్రైస్తవులు ఆరాధనలో వాద్యములు వాయించాలని క్రొత్తనిబంధన బోధించుట లేదు. ఆరాధనలో వాద్యములు వాయించువారికి క్రొత్తనిబంధనలో దొరికే ఋజువుయేమిలేదు. అది కేవలము మనుష్యుల సిద్ధాంతము మాత్రమే అట్టిది వ్యర్థారాధన.

క్రైస్తవులు ప్రార్థన చేయాలని క్రొత్తనిబంధన బోధించుచున్నది (లూకా 18:1, 1కొరింథీ 14:15; 1థెస్స 5:17). ఆదిమ క్రైస్తవులు దీనిని చేసారు. యిది క్రైస్తవారాధన. తన ప్రజలు ఆత్మతోను మనస్సుతోను ప్రార్థించునట్లు దేవుడు సహాయము చేయునుగాక. తాము అభివృద్ధి చెందినకొలది క్రైస్తవులు కానుకలు యివ్వాలని క్రొత్తనిబంధన బోధించుచున్నది (1కొరింథీ 1-:1; 2కొరింథీ 8:7). ఆదిమ క్రైస్తవులు దీనిని చేసారు. యిది క్రైస్తవారాధన. క్రొత్తనిబంధన కృపికి ఈ విధముగా గాక వేరే విధముగా ధనాన్ని ఆర్జించడం ఆరాధనకాదు అది పాపం.

ప్రభువు దినమందు క్రైస్తవులు ప్రభురాత్రి భోజనములో పాలుపొందాలని క్రొత్తనిబంధన బోధించుచున్నది (అపొ.కా. 20:7). ఆదిమ క్రైస్తవులట్లు చేసారు. ఆది క్రైస్తవారాధన ఆదివారమున గాక వేరే దినమునగాని వారానికొకసారిగాక మరింకెప్పుడైనా గాని ప్రభురాత్రి భోజనమునాచరించుట వ్రాయబడిన రీతిగా ఆరాధించుటకాదు.

దేవుని వాక్యాన్ని బోధించాలని ఉపదేశించాలని క్రొత్తనిబంధన బోధించు చున్నది. ఆదిమ క్రైస్తవులట్లు చేశారు. నిజానికి వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్ధనయందును ఎడతెగక యుండిరి యని దైవరికార్డు చెప్పుచున్నది (అపొ.కా. 2:42). యిది క్రైస్తవారాధన దీనినుండి తప్పిపోయినపుడు మనము అపొస్తలుల బోధనుండి తప్పిపోవుదుము. అంతేకాదు పరలోకాన్ని కూడ తప్పిపోవుదుము.

## ఆరాధన నుండి మనం యేమి పొందగలము
## ( What we should take from Worship )

దేవుని యదార్ధముగా ఆరాధించువారు కావలెనని, అట్టివారు ఆత్మతోను సత్యముతోను ఆయనను ఆరాధింతురని దేవుడు కోరుచున్నట్లు క్రీస్తువారు చెప్పారు (యోహాను 4:23,24). అంటే రక్షింపబడినవారు, క్రీస్తు సంఘమైనవారు ప్రతి ఆదివారమున కూడుకొని క్రొత్తనిబంధనను బట్టి దేవుని ఆరాధింతురని దీని యర్ధము. ఆదిమ క్రైస్తవులు అట్లు చేసినట్లు అపొ.కా. 2:42లోను; 20:7లోను మనకు ఒక మాదిరి యున్నది. నిజక్రైస్తవులు ప్రతి ఆదివారమున కూడుకొని పాటలు పాడుదురు, ప్రార్ధింతురు, వాక్యపఠనము చేతురు, ప్రభురాత్రి భోజనములో పాలు పొందుదురు. మరియు కానుకలనిత్తురు. ఎఫెసీ 5:19, 2తిమోతి 2:15, మరియు 1కొరింథీ 16:2లను చదువుము.

ఎవరు ఆరాధనమూర్తియో, ఆరాధకులెవరో, ఏదినమున ఆరాధించాలో, ఎట్లు ఆరాధించాలో యను సంగతులు లేఖనములలో విపులీకరించబడినవి.మనం ఎక్కడ ఆరాధించాలో కూడా మనకు చెప్పబడినది - ఎక్కడ ఇద్దరు ముగ్గురు ఆయన నామమున కూడుకొందురో అక్కడ !(మత్తయి 18:20).

క్రైస్తవుడైనవాడు మిగతా క్రైస్తవులతో ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనుట మాత్రమేగాక. అతడు ఆరాధించాలనే కాంక్షతో దేవునియెడల వినయ విధేయత చూపుచురావాలి. దేవుని ఆరాధించడం, స్తుతించడం మాత్రమేగాక,

మనపై దేవుడు ప్రత్యేక దీవెనలు కుమ్మరించే ఒక సాధనం ఆరాధన. ఆయనకు అంగీకారయోగ్యముగా మనం ఆరాధిస్తే అనేక సంగతులను ఆరాధన నుండి పొందగలము.

1. దేవునితోను. తోటి సోదరులతోను గల సన్నిహిత సహవాసమును బట్టి మనం ఎంతో బలపరచబడుదుము. దేవుడు ఆజ్ఞాపించిన రీతిగ ఆయనను ఆరాధించుట వలన మనకు గొప్ప సంతృప్తి కలుగును. అంతేకాదు ఆయన మనతో యుంటాడనే నిర్ధారణ మనకు కలుగును.

2. కలిసి దేవుని వాక్యాన్ని ధ్యానించి యుంటాము గనుక, దేవుని వాక్యజ్ఞానం కలిగి మనం మన యిండ్లకు వెళ్లుదుము. మన ప్రార్ధనలు తండ్రియైన దేవుని యొద్దకు మనలను మరింత చేరువగా తీసికొని వస్తాయి. ప్రభురాత్రి భోజనంలో పాలుపొందుట ద్వారా, మనలను రక్షించుటకు దేవుడు చెల్లించిన మూల్యమును మరియొకసారి జ్ఞప్తికి తెచ్చుకొంటాము. తద్వారా మన జీవితాలను ఆయన కొరకు మరింత సమర్పించుకొనగలము. చివరిగా దేవుడు ఈ లోకరీత్యామనలను దీవించారు గనుక వాటిలో కొంతతీసికొని వచ్చి, ఆయన పని ముందుకుసాగునట్లు కానుకల నిచ్చే తరుణం మనకు లభించును. ఈపనుల ద్వారా క్రైస్తవుడు ప్రోత్సాహించబడక పోతే, మరిదేని వలనను అతడు ప్రోత్సాహింపబడలేదు.

మనం ఆరాధనకు ఏమి తీసికొని పోతాము? మనం ఆరాధననుండి యేమి పొందుతాము? నీవు పొందాలంటే ఇయ్యాలి. నేనేమీ పొందుట లేదని నీవు చెబితే నీ జీవితంలో తగుమార్పులు చేసుకోవాలని ప్రోత్సాహించుచున్నాము. నీవు యేసు ప్రభువును నమ్మి బాప్తిస్మము పొందినయెడల రక్షింపబడుదువు (మార్కు 16:16). అప్పుడు ప్రభువు నిన్ను తన సంఘముతో చేర్చును. నీవు దేవుని బిడ్డవగుదువు, మరియు దేవుని యదార్ధముగా ఆరాధించువాడవగుదువు (అపొ.కా. 2:47; గలతీ 3:26-27; యోహాను 4:23).

- జె. పి. ఛోట్, U.S.A.

## విశ్వాసము
## ( Faith )

విశ్వాసము మనజీవితములో చాలా ప్రాముఖ్యమైనది. ప్రతి వ్యక్తి దేవునియందు విశ్వాసముంచవలెను. విశ్వాసము అనగా "నిరీక్షింపబడు వాటియొక్క నిజ స్వరూపమును, అదృశ్యమైనవియున్నవనుటకు ఋజువునైయున్నది" (హెబ్రీ 11:1). విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్నువెదకు వారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6) అని దైవలేఖనములు సెలవిచ్చుచున్నవి.

విశ్వాసము అనునది పిస్టీస్, ఫిధియో అను రెండు గ్రీకు పదముల నుండి ఉద్భవించినది. పిస్టీస్ మరియు ఫిధియో అనగా విధేయత కల్గి యుండుట అని అర్ధము. యేసు దేవుని కుమారుడని, మన రక్షకుడని మనమంధరము నమ్ముచున్నాము, ఎందుకు నమ్ముచున్నాము? బైబిలు నందు నమ్మదగినన్ని ఆధారములు వ్రాయబడియున్నవి గనుక. పేరుప్రఖ్యాతులు కల్గిన కొందరు జాతీయనాయకులను మనలో అనేకులు చూచియుండము. వారు ఎప్పుడు జన్మించిరో ఎప్పుడు మరణించిరో మనమెరుగము. అయినను వారు ఈలోకములో జీవించిరని నేను నమ్ముచున్నాను. ఎందుచేతనగా వారు జీవించిరనుటకు అనేక ఆధారములు మనకు కలవు. ఉదా:- మహాత్మాగాంధి, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్.

"నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపము లోనేయుండి చనిపోవుదురని" యేసువారితో చెప్పెను (యోహాను 8:24).

### అబ్రాహాము యొక్క మాదిరి

విశ్వాసులకు తండ్రియైన అబ్రాహామును గూర్చి గమనించినచో అబ్రాహాము అతని జీవితకాలములో చరిత్రకెక్కిన గొప్పవ్యక్తి. ప్రవర్తన విషయములో బహు నమ్రత కల్గినవాడు, దేవుని స్నేహితుడని అతనికి పేరు కలిగెను (యాకోబు 2:23; 2ది.వృ. 20:7; యెషయా 41:8).

అబ్రాహాము తండ్రి తెరహు విగ్రహారాధికుడు. అట్టి విగ్రహారాధన కుటుంబము నుండి అబ్రాహామును వేరుచేసి సర్వశక్తిమంతుడు స్వరూపముగల దేవుని ఆరాధించుటకు "యెహోవా-నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువులు యొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేనునీకు చూపించుదేశమునకు వెళ్లుము"అని దేవుడు అబ్రాహాముతో చెప్పిన వెంటనే తన దేశమును తండ్రి యింటిని విడిచి బయలువెళ్లెను (ఆది12:1-4; యెహోషువ 24:2-3; హెబ్రీ 11:8). మరియు ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలు వెళ్లెను. గొప్ప విశ్వాసమును అబ్రాహాము కల్గియుండెను. 30 సంవత్సరములు గడచిన పిదప దేవుడు అబ్రాహాము శారాలతో ఇట్లని వాగ్దానము చేసెను: నేను ఆమెను ఆశీర్వదించి ఆమెవలన నీకు కుమారుని కలుగజేసెదను అని చెప్పెను. ఈ వాగ్దానములు చేయబడినపుడు వారిరువురును నవ్విరి (ఆది 17:17-18, ఆది18:12-15; హెబ్రీ 11:17-19). నిరీక్షణకు ఆధారము లేనప్పుడు అతడు నిరీక్షణ కలిగి నమ్మెను........ వాగ్దానము చేసినదానిని నెరవేర్చుటకు దేవుడు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసమువలన బలము పొందెను (రోమా 4:17-21; యాకోబు 2:23). "కాబట్టి అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా ఎంచబడెను".

## యాజకుడైన జెకర్యా

అబ్రాహాము కుటుంబమును పోలిన మరియొక కుటుంబమును గూర్చి క్రొత్తనిబంధనలో చదువగలము. జెకర్యా అను ఒక యాజకుడుండెను. అతని భార్య పేరు ఎలీసబెతు. వీరిద్దరు ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగా నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతులై యుండిరి. ఎలీసబెతు గొడ్రాలైనందున వారికి పిల్లలు లేకపోయిరి; మరియు వారిద్దరు బహుకాలము గడచిన వృద్ధులైరి (లూకా 1:5-7). జెకర్యా దేవాలయములో యాజకత్వము చేయుచుండగా దేవదూత కనబడి నీ భార్యయైన ఎలీసబెతు కుమారునికనును, అతనికి యోహాను అను పేరు పెట్టుదువు అనిచెప్పెను. గబ్రియేలు ద్వారా దేవుడు తెలిపిన సువర్తమానమును జెకర్యా నమ్మలేదు. కనుక ఈ సంగతులు జరుగుదినము వరకు జెకర్యా మాటలాడక మౌనియై యుండెను

(లూకా 1:18-22,63,64). యోహాను జన్మించిన పిదప అతని నోరు తెరువబడి, నాలుక సడలి, మాటలాడసాగెను.

అబ్రాహాము జెకర్యా దంపతులు ఒకే దేవునిని ఆరాధించుచుండిరి. వీరిరువురు బహుకాలము గడచిన వృద్ధులైరి కాని అబ్రాహాము దేవుని నమ్మెను. జెకర్యా నమ్మలేదు. కనుక ప్రియచదువరీ నీవు ఎవరి లాంటి విశ్వాసము కల్గియుంటివి? మనమందరము అబ్రాహాములాంటి విశ్వాసము కల్గియుందము. అబ్రాహాముదేవుని నమ్మెను. అది అతనికి నీతిగా ఎంచబడెను. జెకర్యా అల్ప విశ్వాసము కల్గియుండెను. దేవుని వాగ్దానములను గూర్చి అపనమ్మిక యుంచరాదు. విశ్వాసమును బట్టి రాహాబును వేశ్యవేగులవారిని సమాధానముగాచేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపక పోయెను (హెబ్రీ 11:31). రాహాబు కేవలము విశ్వాసమును బట్టి తన కుటుంబమును రక్షించుకొనలేదు. ఆమె దేవునియందు విశ్వాసముంచెను. "మీ దేవుడైన యెహోవా పైన ఆకాశమందును క్రింద భూమియందును దేవుడే. మీఎదుట ఎట్టి మనుష్యులకైనను ధైర్యమేమాత్రము ఉండదు" (యెహోషువ 2:2-18). రాహాబు దూతలను చేర్చుకొని వేరొక మార్గమున వారిని వెలుపలికి పంపివేసినప్పుడు క్రియల మూలముగా నీతిమంతురాలని యెంచబడెను (యాకోబు 2:25). ఇద్దరు వేగులవారి ప్రమాణ ప్రకారము వారిని దించిన కిటికీ ఎఱ్ఱని దారమును కట్టుట (క్రియలు) ద్వారా రక్షించబడెను. ప్రాణములేని శరీరమేలాగు మృతమో ఆలాగే క్రియలులేని విశ్వాసమును మృతము (యాకోబు 2:26). మనమును రాహాబు వలె క్రియలుగల విశ్వాసము కల్గియుందము.

## రక్తస్రావము గల స్త్రీ

పంద్రెండేండ్ల నుండి రక్తస్రావరోగము కలిగిన యొక స్త్రీ యుండెను. ఆమె అనేక వైద్యులచేత ఎన్నో తిప్పలు పడి తనకు కలిగిన దంతయు వ్యయము చేసికొని, యెంత మాత్రమును ప్రయోజనములేక మరింత సంకటపడెను. ఆమె యేసు గూర్చి విని నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదు ననుకొని, జనసమూహముతో ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రము ముట్టెను.

వెంటనే ఆమె రక్తధారకట్టెను గనుక తన శరీరములోని ఆ బాధ నివారణమైనదని గ్రహించుకొనెను (మార్కు 5:25-34). ఈ స్త్రీవలె నేడుఅనేకులు ఆత్మపూర్ణులైన వారిగా పిలువబడుచున్న వారి వస్త్రములు ముట్టి స్వస్థత పొందవలెనని ఆశించుచున్నారు. పేరు ప్రఖ్యాతులు గడించి వాక్యమును కలిపిచెరిపెడి ఈ బోధకుల యందు నమ్మికయుంచి విశ్వాసభ్రష్టులగుచున్నారు. విశ్వాసము దర్శనములు ద్వారా కలుగదు. స్వప్నములద్వారా, చిన్ని చిన్ని గుసగుసలు ద్వారా అద్భుతాల ద్వారా కలుగదు. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). కేవలం విశ్వాసము మాత్రమే రక్షించదు. విధేయత కూడా అవుసరము.

## నీ విశ్వాసమెట్టిది?

ప్రియ సహోదరా, సహోదరీ నీ విశ్వాసము ఎంత బలమైనది? దేవుని వాగ్దానములపట్ల నీవు ఎంత లోతైన విశ్వాసమును కల్గియున్నావు? నీవు దేవునియందును, క్రీస్తునందును, బైబిలునందును, పరలోకమునందును ఎంత ప్రగాఢమైన విశ్వాసము కల్గియున్నావు? ఎందుకు యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట మిక్కిలి ప్రాముఖ్యమైయున్నది? నీ పాపములనుండి రక్షించబడుటకు క్రీస్తునందు విశ్వాసముంచవలెను (మార్కు 16:16; అపొ.కా. 16:30-31). నిత్యజీవము పొందుట కొరకు (యోహాను20:30-31) ఆత్మీయ మరణమునుండి తప్పించబడుట కొరకు (యోహాను 8:24). గనుక నీవు తడవుచేయక వాక్యమును విని, విశ్వసించి, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు ప్రభువు నిన్ను రక్షించును. అప్పుడు నీవు క్రీస్తునందు నిజ విశ్వాసివి కాగలవు (2కొరింథీ 13:5; రోమా 10:17; అపొ.కా. 2:38; రోమా 10:9-10; అపొ.కా. 22:16). ఈ దినమే నీ విశ్వాసమును పరీక్షించుకో నీజీవితమును మార్చుకో!

- పి. చంద్రశేఖర్,
స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ-3.

## పండుగలు - పర్వదినాలు

మతశాఖలలో సభ్యులై క్రైస్తవులమని చెప్పుకొనబడే కొందరు ఏదో ఒక సమయంలో క్రీస్తును గుర్తుంచుకొనుట సంతోషింప తగ్గదే. అయినా యేసుక్రీస్తు ఉపదేశించిన రీతిగా మన ఆచరణ ఉంటే మనం క్రీస్తును గౌరవించిన వారమవుతాం. ప్రభురాత్రి భోజనమును ఏర్పాటు చేసిన సందర్భాన ఆయన సెలవిచ్చిన దేమనగా "ఆయన యొక రొట్టెను పట్టుకొని, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, దాని విరిచి వారికిచ్చి -ఇది మీకొరకు ఇవ్వబడుచున్న నాశరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని చెప్పెను" (లూకా 22:19). క్రీస్తు ఆదేశించిన రీతిగా అనేకులు రొట్టె విరచుటను ఆచరించుటలేదు.

గలతియ సంఘములో కొందరు క్రైస్తవులు పండుగలు- పర్వదినాలను ఆచరించుచున్న సందర్భమున అపొస్తలుడైన పౌలు వారిని గద్దించి నచ్చచెప్పిన విధమును చూడగలము. "ఇప్పుడు మీరు దేవుని ఎరిగిన వారును, మరి విశేషముగా దేవునిచేత ఎరుగబడిన వారునై యున్నారు, గనుక బలహీనమైనవియు, నిష్ప్రయోజనమునైనవియైన మూలపాఠముల తట్టు మరల తిరుగనేల? మునుపటి వలె మీరు వాటికి దాసులైయుండగోరనేల? మీరు దినములను మాసములను, ఉత్సవకాలములను, సంవత్సరములను ఆచరించుచున్నారు. మీ విషయమై నేను పడిన కష్టమువ్యర్థమై పోవునేమో అని మిమ్మును గూర్చి భయపడుచున్నాను" (గలతీ 4:9-11).

మనము క్రీస్తు బోధలకు బద్ధులమై యుండాలే తప్ప దానిని విడిచి హెచ్చు తగ్గులు చేయుట సరియైనది కాదు. "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపని వాడు. ఆబోధయందు నిలిచి యుండు వాడు తండ్రిని, కుమారుని అంగీకరించువాడు (2యోహాను :9). దేవుని వాక్యములో అన్ని విషయములు సంపూర్ణముగా లిఖించ బడియున్నవి. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును,

తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజన కరమైయున్నది" (2తిమోతి 3:16,17).

క్రీస్తు బోధలలో ఎక్కడ క్రిస్మస్‌ను గూర్చి చెప్పబడలేదు. పరిశుద్ధ గ్రంథ పుటలలో ఎక్కడ ఆ పదం కానరాదు. బైబిలు పండితులు సైతం క్రీస్తు పుట్టిన దినం ఫలానా అని పొందుపర్చలేదు. అది మనం ఆచరింపక తప్పనిదైతే అపొస్తలులు మరియు నూతన నిబంధన గ్రంధకర్తలు ఎక్కడైనా తప్పక దాన్ని గూర్చి వ్రాసేవారే. లూకా 2:8లో కొందరు గొఱ్ఱెల కాపరులు రాత్రివేళ తమ మందను కాచుకొను చుండగా ప్రభువు దూత వారికి రక్షకుని పుట్టుకను గూర్చి వారికి తెలియ పరచెను. అంతే తప్ప అది డిశంబరు 25న లేక మరొక దినాన అని ఉదాహరించబడలేదు. క్రిస్మస్-(Christmas) -క్రీస్తు పూజ బైబిలులో కన్పించదు కానీ రోమా సామ్రాజ్యంలో దీని ప్రారంభం కన్పిస్తుంది. ఇది కేవలం మానవకల్పితమే. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్ధముగా ఆరాధించు చున్నారు" (మత్తయి 15:9). అపొస్తలుడైన పౌలు వివరణ చూస్తే "మీరు క్రీస్తుతో కూడా లోకము యొక్క మూల పాఠముల విషయమై మృతిపొందినవారైతే లోకములో బ్రదుకుచున్నట్లుగా మనుష్యుల ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి చేత పట్టుకొనవద్దు, రుచి చూడవద్దు, ముట్టవద్దు, అను విధులకు మీరు లోబడ నేల? అవన్నియు వాడుకొనుట చేత నశించిపోవును" (కొలస్సయి 2:20-22). అనేకులు మతం పేరిట చెప్పబడ్డ ప్రతీదీ అంగీకరిస్తారు, ఆచరిస్తారు. అంతేగాని చెప్పబడినది దైవవాక్యాను సారమైనదా కాదా? అని యోచించరు పరిశీలించరు. ఈ విషయాన్ని గూర్చి యోహాను సెలవిచ్చినది పరిస్తే "ప్రియులారా! అనేకులైన అబద్ధ బోధకులు లోకములోనికి బయలు వెళ్ళి యున్నారు, గనుక ప్రతి ఆత్మ (బోధ)ను నమ్మక, ఆయా ఆత్మలు (బోధలు) దేవుని సంబంధమైనవో కావో పరిశీలించుడి (1యోహాను 4:1).

ఈనాడు క్రైస్తవ్యములో అనేక బోధకులు దైవవాక్యాను సారముగా కాకవారి ఆలోచనా సరళిలో వాక్యమును బోధించుచున్నారు. మతం పేరిట ప్రబోధించినదంతా సత్యము కానేరదు. బెరయ క్రైస్తవుల వలె విన్న బోధలను వాక్యపు వెలుగులో

పరీక్షించండి. క్రీస్తు ఉపదేశములు విని, విశ్వసించి తరించండి.

మనము ఒకరియెడల ఒకరు ప్రేమ కలిగి యుండవలె, బహుమతులు ఇచ్చి పుచ్చుకోవలె, క్రీస్తు ఈ భువిపై పుట్టినందుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలె, దేవునికి స్తుతి చెల్లింపవలె- ఇవన్నియు ఆయా సమయములలో ఆచరించుటకాదు గానీ-ఎల్లప్పుడు,నిరంతరము, ఆచరింపవలెను. "కాగా నా ప్రియ సహోదరులారా! మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని ఎరిగి, స్థిరులును, కదలని వారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులై యుండుడి" (1కొరింథీ 15:58).

- ఆర్. ఛెఖెసాంగ్, నాగాలాండ్.

## దేవుని యిల్లు
## ( The House of God )

" ప్రతి యిల్లును ఎవడైన ఒకనిచేత కట్టబడును, సమస్తమును కట్టినవాడు దేవుడే" యని హెబ్రీ పత్రిక లేఖకుడు మనకు చెప్పుచున్నాడు (హెబ్రీ 3:4). దేవునికొక గృహమున్నదని, అదే సంఘమని కూడ లేఖనములు బయలు పరచు చున్నవి (1కొరింథీ 3:9). 1తిమోతి 3:15లో మనకుఇట్లు కనబడుచున్నది: "అయినను నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో అనగా జీవము గల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీసంగతులు నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునై యున్నది" (1తిమోతి 3:15). దేవుని సంఘమైన మందిరమును గూర్చి, "యెహోవా యిల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాస వ్యర్థమే" యని దావీదు చెప్పిన సంగతిని మనము మనస్సునందుంచుకొనవలెను (కీర్తన 127:1).

ఈ గృహమును గూర్చిన ప్రముఖ సత్యములను మనము గమనించెదము:

1. దాని పునాది యేసుక్రీస్తు : "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమునుకట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని

నేను నీతో చెప్పుచున్నాను" (మత్తయి 16:18). "వేయబడినది తప్ప మరియొక పునాది ఎవడును వేయనేరడు, ఈ పునాది యేసుక్రీస్తే" (1కొరింథీ 3:11).

2. దాని ముఖ్య మూలరాయికూడ క్రీస్తే: "కాబట్టి మీరికమీదట పరజనులును పరదేశులునై యుండక పరిశుద్ధులతో ఏకపట్టణస్థులును దేవుని ఇంటివారునై యున్నారు. క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరుకూడ ఆత్మ మూలముగా దేవునికి నివాస స్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:19-22).

3. అది సజీవమైన రాళ్ళతో సమకూడిన ఆత్మీయ మందిరము. "యేసు క్రీస్తుద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1పేతురు 2:5).

4. దేవుని గృహముగా తయారగుటకు దాని సభ్యులు ప్రభువు యొక్క కుటుంబములోనికి జన్మించినవారు: "అందుకు యేసు ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నీకొదేము ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు ? రెండవమారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయనను అడుగగా యేసు ఇట్లనెను-ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:3-5). "మీరు క్షయ బీజమునుండి కాక, శాశ్వతమగు జీవముగల దేవునివాక్య మూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడినవారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనినవారై యుండి, యొకని నొకడు హృదయపూర్వకము గాను మిక్కుటముగాను ప్రేమించుడి" (1పేతురు 1:22,23).

5. ఈ గృహసభ్యులు దేవుని బిడ్డలు: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26,27; రోమా 8:4; గలతీ 4:4-7; ఫిలిప్పీ 2:15; 1యోహాను 3:1,2లను కూడ చదవండి).

6. ఈ గృహమునకు శిరస్సు క్రీస్తే: "అయితే క్రీస్తు కుమారుడైయుండి,ఆయన యింటిమీద నమ్మకముగా ఉన్నాడు; ధైర్యమును నిరీక్షణవలన ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టిన యెడల మనమే ఆయన యిల్లు" (హెబ్రీ 3:6). "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు " (ఎఫెసీ 5:23).

7. ఈ గృహమంతటికి తండ్రి దేవుడే: "కావున మీరు వారి మధ్యనుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన, దానిని ముట్టకుడి యని ప్రభువు చెప్పుచున్నాడు. మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నారు" (2కొరింథీ 6:18).

8. అది దేవుని గృహము, విశ్వాసగృహము, దేవుని యిల్లు అని పిలువబడినది. "మేము దేవుని జతపనివారమై యున్నాము; మీరు దేవుని గృహమునై యున్నారు" (1కొరింథీ 3:9). కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారియెడలను మేలు చేయుదము" (గలతీ 6:10). "తీర్పు దేవుని ఇంటి యొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది. అది మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైనవారి గతి యేమవును?" (1పేతురు 4:17). కుటుంబమంతయు ఆయన నామమును ధరించుకొనియున్నది (ఎఫెసీ 3:14,15).

దేవుని యిల్లు సూక్ష్మముగా యేసుక్రీస్తుపై నిర్మించబడిన సంఘము. దేవుడే తండ్రి, సభ్యులు ఆయన బిడ్డలు. ఒకే ఒక్క యిల్లు ఉన్నది, అది దేవునికి చెందును. యేసు దాని శిరస్సై యున్నాడు. అనేక యిండ్లుండినను, దేవునికుండిన

గృహము ఒకే ఒక్కటి. దానినే ఆయన తన దానిగ పరిగణించును. నీవు ఏదో ఒక గృహ సభ్యుడవై యున్నంత మాత్రమున సరిపోదు. గాని ప్రశ్న యేమంటే నీవు ప్రభువు గృహములో సభ్యుడవై యున్నావా ? లేనియెడల నీవు దేవుని యింటికి వెలుపల యున్నావు. దానిలో యుండు క్షేమమునకును ఆశీర్వాదములకును నీవు దూరముగా యున్నావు. నీవు దేవుని షరతులను విని, వాటి ననుసరించి ఆయన కుటుంబము లోనికి జన్మించిన యెడల మాత్రమే ఆయన కుటుంబ సభ్యుడవు (మార్కు 16:16, అపొ.కా. 2:38, యోహాను 3:3-5, అపొ.కా. 2:47, 2కొరింథీ 5:17).

- జె.సి.ఛోట్.

## అభ్యంతరాలను జయించుట

## ( Overcoming Hinderances )

చరిత్రలో మనం చూస్తే అనేక క్లిష్టపరిస్థితులున్నను వాటిని జయించి విజయవంతమైన జీవితాన్ని గడిపినవారిని గూర్చి చదువగలం. ప్రగాఢమైన ప్రయత్నాలవలన, కష్టపడి పనిచేయుటవలన వారట్టి జయాన్ని సంపాదించగలిగారు. అబ్రహామ్ లింకన్ నిరుపేద కుటంబములో జన్మించినను, పేదతనాన్ని జయించి చివరకు అమెరికా అధ్యక్షుడయ్యాడు. లాల్‌బహదూర్ శాస్త్రి కూడ విద్యాభ్యాసంచేసే దినాల్లో అనేక క్లిష్ట పరిస్థితుల నెదుర్కొని, భారత ప్రధాని అయ్యాడు.

బైబిలులోకూడ, అనేక అవాంతరాలు కలుగుచున్నను వాటినెదుర్కొని ప్రభువుకొరకు జీవించిన వారినిగూర్చి మనం చదువగలము. లూకా సువార్త 19వ అధ్యాయములో జక్కయ్యను గూర్చి మనం చదువగలము. యేసుప్రభువు "యెరికో పట్టణములో ప్రవేశించి దానిగుండా పోవుచుండెను. ఇదిగో సుంకపు గుత్తదారుడును ధనవంతుడునైన జక్కయ్య అను పేరుగల ఒకడు యేసు ఎవరోయని చూడగోరెను, గాని పొట్టివాడైనందున జనులు గుంపు కూడియుండుటవలన చూడలేకపోయెను. అప్పుడు యేసు ఆ త్రోవను రానైయుండెను గనుక అతడు ముందుగా పరుగెత్తి

ఆయనను చూచుటకు ఒక మేడిచెట్టెక్కెను. యేసు ఆ చోటికి వచ్చినప్పుడు, కన్నులెత్తి చూచి-జక్కయ్యా త్వరగా దిగుము, నేడు నేను నీయింట నుండవలసి యున్నదని అతనితో చెప్పగా అతడు త్వరగా దిగి సంతోషముతో ఆయనను చేర్చుకొనెను" (లూకా 19:1-6).

కొన్ని అభ్యంతరాలున్నను జక్కయ్య ప్రభువుని కనుగొన్నాడు. జక్కయ్యను గూర్చి తెలిసికొనుటవలన మనం దేవుని సత్యాన్ని, ఆయన సంఘాన్ని కనుగొనాలంటే ఎట్టివారమైయుండాలో తెలిసికోగలము. తన యెదుటనున్న అవాంతరాలను జయించుటవలన జక్కయ్య ఆత్మీయంగా ఎంతో సాధించాడు.

జక్కయ్యను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే తన ధనం ఒక సమస్యగా అతనికి తయారయ్యింది. తన పూర్వీకులనుండి పొందినందున కొంతమట్టుకు జక్కయ్య ధనవంతుడై యుండవచ్చును; మరికొంత అతడు కష్టపడి సంపాదించినది కావచ్చును. ఆరోజుల్లో ధనం సంపాదించడం చాల కష్టం; ధనవంతులు బహు అరుదు. అందువలన జక్కయ్యను గూర్చి ప్రజలు సంశయించేవారు. అతడేదో అక్రమంగా ఆ ధనాన్ని సంపాదించి యుంటాడని వారు తలంచేవారు.

ఈనాటి ప్రజలలో కూడ అట్టి మనస్తత్వమే నిలిచియున్నది. ఎవరైనా ఆర్థికంగా మంచి స్థితిలో యుంటే వారిని గూర్చి రకరకాల కథలు చెప్పుకొంటూ పుకార్లు పుట్టించే వారున్నారు. జక్కయ్య అయితే అక్రమంగా ఆస్తిని సంపాదించిన వానివలె మట్టుకు కనబడ్డటంలేదు. ఒకని ఆత్మీయాభివృద్ధికి ధనం అభ్యంతరం కాగలదని మనం గ్రహించాలి.

ధనవంతుడైన అధికారి ఒకడు యేసునొద్దకు వచ్చి నిత్యజీవానికి వారసుడను అగుటకు నేనేమి చేయాలి అని అడిగాడు. "నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును, నీవు వచ్చి నన్ను వెంబడింపుమని యేసు అతనితో చెప్పెను. అతడు మిక్కిలి ధనవంతుడు గనుక ఈ మాటలు విని వ్యసనపడుచు వెళ్ళిపోయాడు" (లూకా 18:18-23). జక్కయ్య అయితే తన

ధనాన్నిగూర్చిన అభ్యంతరాన్ని జయించినట్టు కన్పడుచున్నాడు. అతి ధనవంతుడైనను యేసును చూడగోరాడు.

తరువాత, యేసును చూడడానికి జక్కయ్య యొక్క పొట్టితనం అడ్డువచ్చింది. యేసుప్రభువు యెరికోపట్టణంగుండా వెళ్ళుచున్నాడని యెరిగి అతడాయనను చూడగోరాడు. యేసు వచ్చుచున్నాడన్న వార్త పట్టణమంతా త్వరగా వ్యాపించేసింది. జనులు గుంపులుగా కూడారు. యేసును ఆ గుంపులో అతడు చూడలేకపోయాడు. అతడసలే పొట్టివాడు. అందులోను ఈ జన సమూహం అడ్డువచ్చారు. గాని యేసును చూడాలనే ఆశ మాత్రం అతనికెక్కువయ్యింది. యేసు ఆ త్రోవను రానైయుండెను గనుక అతడు ముందుగా పరుగెత్తి ఆయనను చూచుటకు ఒక మేడిచెట్టెక్కాడు. ఆ పైనుండి యేసును చూచాడు. తన పొట్టిదనాన్ని. భౌతికంగా తనకున్న అభ్యంతరాన్ని జయించాడు.

శారీరకంగా ఏలోపమున్నను, జయించే నిశ్చయత మనకుంటే దాన్ని జయించగలము. నేను నోటిమాంద్యము, నాలుకమాంద్యము గలవాడను అని మోషే ఏవేవో సాకులు చెప్పసాగాడు. గాని దేవుడతన్ని తన పనికొరకు గొప్పగా వినియోగించుకొన్నాడు (నిర్గమ 4:10-12). మనము కూడ అట్లే మన శారీరక బలహీనతలను మరచి ప్రభువు పని చేయగోరినయెడల ఆయన మనలను తప్పక వినియోగించుకొంటాడు.

శారీరకంగా గాకనే సాంఘికంగాను, ఆర్థికంగాను పొట్టిగాయున్న వారనేకులున్నారు. నేను సాంఘికంగా వెనుకబడినవాడను, లేదా వెనుకబడినదానను అని ప్రభువు పరిచర్యలో వెనుకంజ వేయరాదు. మేము బీదలము గదా, ప్రభువు పనికి మేమేమి పనికిరామని కొందరనుకొంటారు. వీరు బీదతనాన్ని జయించాలి. దేవుని వాక్యం ఇలా చెబుతుంది: “నా ప్రియసోదరులారా, ఆలకించుడి; ఈలోక విషయములో దరిద్రులైన వారిని విశ్వాసమందు భాగ్యవంతులు గాను, తన్ను ప్రేమించువారికి తాను వాగ్దానము చేసిన రాజ్యమునకు వారసులుగాను ఉండుటకు దేవుడేర్పరచుకొనలేదా?” (యాకో 2:5). క్రైస్తవులైన కొందరు ఆత్మీయంగ

పొట్టివారు. జక్కయ్యవలె వారు తమ ఈలోటును జయించాలి. జక్కయ్య శారీరకంగాయున్న పొట్టిదనాన్ని జయించాడు. యేసును చూచాడు.

మూడవదిగా, జక్కయ్యకు తన వృత్తియే అభ్యంతరకరమైరది. అతడు సుంకపు గుత్తదారుడు. అతడు పన్నులు వసూలుచేసే వాళ్లలో ముఖ్యుడు. సుంకరులు పన్నులు వసూలు చేసేవారు. ఈనాడు కూడా పన్ను వసూలు చేసే వారు ప్రజలకు సాధారణంగా ప్రీతికరమైనవారు కాదు. ఆనాడు అంతే. ఒక ప్రాంతములోయున్న ప్రజలనుండి పన్ను వసూలు చేసే అధికారం వీరికి ఇయ్యబడేది. దానిలో కొంత భాగాన్ని వారు రోమా ప్రభుత్వానికి చెల్లించాలి. ప్రజలనుండి ఏమైనా ఎక్కువ వసూలు చేస్తే అది ఈ సుంకరులదే. ఈ సుంకరులంటే ఎవరూ ఇష్టపడేవారు కాదు. యూదులలో సుంకరులు వెలివేయబడినట్టివారుగా పరిగణించబడేవారు. సుంకరులు పాపులని యూదులు తలంచేవారు. వాళ్లు అక్రమంచేసినా, చేయకపోయినా యూదుల దృష్టిలో సుంకరులు పాపులే. జక్కయ్య ఇట్టి అవాంతరాలన్నిటినీ ఎదుర్కోవలసి వచ్చింది. అతడు వాటన్నిటినీ జయించాడు. జక్కయ్య ఈ అభ్యంతరాలన్నింటినీ ఎందువలన జయించగలిగాడు? అదెలా సాధ్యమయ్యింది?

మొదటిగా జక్కయ్య సహజంగా నిష్కపటుడు. మేడిచెట్టుపైనున్న జక్కయ్యను ప్రభువు చూచినప్పుడు, జక్కయ్యా ఈవేళ నేను నీ యింటిలో యుండబోవుచున్నానని చెప్పాడు. ఆయన అతని యింటనున్నప్పుడు, "నేనెవనియొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనినయెడల అతనికి నాలుగంతలు చెల్లింతునని ప్రభువుతో" జక్కయ్య చెప్పాడు. ధర్మశాస్త్రమయితే అన్యాయముగా తీసికొనిన దంతయును, దానిపై 5వ వంతును చెల్లించాలని చెప్పింది (సంఖ్యా 5:6,7). జక్కయ్య అయితే నాలుగు రెట్లు ఇస్తానని చెప్పాడు. ఇంకో మాటలో నేనెవనిని మోసంచేసి యేమీ సంపాదించలేదని అతడు చెప్పాడు.

రెండవదిగా జక్కయ్య ధర్మకార్యములు చేయుటలో ఆసక్తిగలవాడు. "నా ఆస్థిలో సగము బీదలకిచ్చుచున్నానని" అతడు చెప్పాడు. అతడు నిస్వార్థపరుడు.

బీదలను గూర్చి చింతించువాడు. అతడెక్కువ ధర్మం చేసినాసరే, యూదులు మాత్రం అతడు పాపియని తలంచేవారు. జక్కయ్య నిస్వార్థపరుడు గనుకనే త్వరలో ప్రభువును కనుగొన్నాడు.

జక్కయ్య భక్తిగలవాడు గనుక ప్రభువును కనుగొనగలిగాడు. అతడు మేడిచెట్టుపై నుండగా ప్రభువతనిని గమనించాడు. "జక్కయ్యా త్వరగా దిగుము. నేడు నేను నీయింట బసచేయవలసియున్నదని" ప్రభువతనికి చెప్పాడు. అతని ఆనందము పట్టలేనంత అయ్యింది. క్రీస్తుతో ఉండడమే అతనికానందం. భౌతిక సంగతులకంటె ఆత్మీయ సంగతులంటే అతనికి ఆసక్తి ఎక్కువ.

జక్కయ్య సుంకపుదారుడు. ధనవంతుడే అయినను అతడు సాధారణంగా మంచివాడు. అతడు దేవుని ప్రేమించాడు. నిష్కపటుడు. నిస్వార్థపరుడు, ధర్మకర్త. అందువలనే యేసు, "ఇతడును అబ్రాహాము కుమారుడే; ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది. నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పాడు" (లూకా 19:9,10).

జక్కయ్య జీవితంలో ఎన్ని అభ్యంతరాలున్నను వాటిని జయించి ప్రభువును కనుగొన్నాడు. నీవుకూడ ప్రభువునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందితే ప్రభువు నీకును రక్షణ అనుగ్రహిస్తాడు.

- జాషువా గూటం.

## ప్రేమించుకాపరి

### ( The Loving Shepherd )

"యెహోవా నాకాపరి" యను 23వ దావీదు కీర్తనను బైబిలును ప్రేమించు వారు బాగుగా ఎరిగి యుందురు. ఆకీర్తన చాల మందికి ఇష్టము కూడా. గొర్రెల

యెడల వాటి కాపరికున్న సంబంధముతో పోల్చి తన ప్రజల యెడల దేవునికున్న ప్రేమానురాగములు అందు వర్ణింపబడినవి.

దేవుని ప్రేమను వర్ణించడానికి బైబిలు అనేక దృశ్యములను మనముందుంచు చున్నది. కుమ్మరి తన చక్రముపై చక్కటి పాత్రను సృష్టించుట దీనికొక దృష్టాంతము (యిర్మీయా 18:1-6). ఒక నిర్మాణికుడు ఒక భవనము నిర్మించుటలో కావలిసిన ప్రశస్తమైన రాళ్ళను ఎట్లు ఎంచుకుంటాడో అట్లే దేవుడు తన ఆత్మీయ మందిరాన్ని సజీవమైన రాళ్ళతో నిర్మించాడు (1కొరింథీ 3:10-11). తప్పిపోయిన కుమారుని యెడల తండ్రికున్న ప్రేమవలె, దేవుని ప్రేమ మనయెడల ఉన్నది. తన వధువు యెడల భర్త ఎట్టి ప్రేమను కలిగి యుంటాడో దేవుడు మనయెడల అట్టి ప్రేమను కలిగియున్నాడు (లూకా 15:11-24; ఎఫెసీ 5:25-27). అయితే 23వ కీర్తనలో వర్ణించబడిన కాపరికంటే దేవుని ప్రేమ అతి సౌందర్యమైనది.

యేసుప్రభువుకు కూడ ఈ కీర్తన అంటే చాల ఇష్టమనే చెప్పుకోవాలి. ఏలయనగా తానొక మంచి గొర్రెల కాపరినని గొర్రెల నిమిత్తము తన ప్రాణమును కూడ పెట్టెదనని ఆయన మనకు బోధించాడు (యోహాను 10:11-12).

భూమ్యాకాశములను ఎవరు సృజించారో (ఆది.కా. 1:1) విశ్వాన్నంతటినీ తన శక్తి చొప్పున ఎవరు చలింపచేయుచున్నారో, తన సంకల్పము జరుగులాగున జనాంగముల మధ్య, ప్రజల మధ్య ఎవరు పని చేయుచున్నారో, తన వాక్యము ద్వారాను మరింత విశేషముగా తన కుమారుని ద్వారాను ఎవరు తన్నుతాను బయలు పరచుకొన్నారో అట్టి యెహోవా నాకాపరి. అట్టి గొప్ప శక్తి సామర్థ్యములు గల దేవుడు తన మార్గదర్శియని దేవుని వెంబడించు వానికి నిర్ధారణ ఇవ్వబడి యున్నది. ఆయన అతనికి ప్రేమ పూర్వకమైన ఆదరణ నొసగును.

'నాకాపరి' యనుటలో వ్యక్తిగత సంబంధము వ్యక్తమగుచున్నది. 23వదావీదు కీర్తనలోని మాధుర్యమంతా దానిలో ప్రకటింపబడుచున్న వ్యక్తిగత సంబంధంలో వ్యక్తమగుచున్నది. నీవు ఆయన గొర్రెలలో ఒకడవైతె యెహోవా నీకాపరి, యెహోవా నాకాపరి కూడాను.

కాపరియొక్క నడిపింపు మీదను జాగ్రత్తలోను గొర్రెలు ఆధారపడి యుంటాయి, అవి సులభంగా భయపడ్తాయి. ప్రమాదాన్ని తప్పించుకొనుటకు ఒక మందగా పరుగెడతాయి. నాయకుని అవి సునాయాసంగా వెంబడిస్తాయి. వాటి యొక్క భుక్తి, రక్షణ వగయిరాలన్ని కాపరి యొక్క జాగ్రత్త మీదనే ఆధారపడి యుంటాయి.

ప్రభువు కాపరియై యుండగా వ్యక్తిగత అవసరాలన్ని తీరుతాయి. "నాకులేమి కలుగదు". అవసరాలన్నిటి తీర్చు కాపరిని వెంబడించు ఆత్మీయ గొర్రెలయొక్క అనుభవం యిది.

పూర్తిగా సంతృప్తి జెందేవరకు మేత మేయుటకు పచ్చికగల చోట్లు కలవు. గొర్రెలు సులభముగా భయపడునవి గనుక అలజడి యున్న జలముల యొద్దకు నీరు త్రాగుటకు రావు. గనుక శాంతికరమైన జలములు వాటికున్నవి. దేవుని ప్రజలు భుజించడానికి ఆత్మీయాహారమైన దేవుని వాక్యమున్నది. వారి ప్రార్థనా ప్రవాహములే శాంతికరమైన జలములు.

## నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు

గొర్రెలవలె మనమందరము త్రోవ తప్పిపోతాము. దేవుని ప్రేమయొక్క గొప్ప నిదర్శనమే ఆయన క్షమాపణ, మనలను వెదికి ఆయన దొడ్డిలో మరల చేర్చుటకు ఆయనకున్న ఆసక్తి-వందగొర్రెలను గూర్చి యేసు చెప్పిన ఉపమానము దీనిని చిత్రీకరించుచున్నది (లూకా 15:3-7). మంచికాపరివలె ప్రభువు తన ప్రజలను ఎల్లవేళల నీతి మార్గములలో నడిపించును. ఆయన నాయకత్వము వలన వారెన్నడు భయపడరు.

## గాఢాంధకారపు లోయ

ప్రతి మానవుని జీవితము చివరకు గాఢాంధకారపులోయగుండా అంటే మరణపు లోయగుండా పయనించవలసిందే. మనము ఈ లోయలో ఏకాకిగా

పయనించవలసిందే. వెళ్ళుచున్న వారు మనకెంత ప్రియులైనను వారికూడ మనము వెళ్ళలేము.-ఈ లోయలో సంచరించునపుడు ప్రభువు ఒక్కడు మాత్రమే మనతో యుంటాడు గనుక ఏ అపాయమునకు భయపడము. "నీ దుడ్డుకర్రయు, నీదండమును నన్ను ఆదరించును". ఆయన నన్ను పోషించాడు గనుక అంతము వరకు నాతో యుంటాడు నా ప్రాణానికి సేదదీర్చాడు, పునరుద్ధరించాడు గనుక అంతిమ విజయము సాధించే వరకు ఆయన గాఢాంధకారపు మరణములో నాతో సంచరించును.

## సిద్ధపరచబడిన భోజనము

ఒక శ్రేష్ఠమైన గృహయజమానివలె నా శత్రువుల యెదుట ఆయన నాకు పసందైన భోజనము సిద్ధపరచును. ఆయన కాపరినుండి శ్రమలనుండి వేరుగా సిద్ధపరిచిన విందు యజమానివలె ఇక్కడ వర్ణించబడ్డాడు. "నాగిన్నె నిండి పొర్లు చున్నది".

## ఫలితము

దేవుని ప్రేమను ఈరీతిగా వర్ణించిన తరువాత కీర్తనల గ్రంధకర్త (గాయకుడు) 23వ కీర్తనను ఈ దిగువ విశ్వాస నిర్ధారణ మాటలతో ముగించుచున్నాడు. "నేను బ్రతుకు దినములన్నియును కృపా క్షేమములే నా వెంటవచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను". తన ప్రజల జీవితకాలములో దేవుని ప్రేమ వారి చుట్టూ ఆవరించుకొని యుండుటయేగాక, నిత్యత్వంలో మహిమను, ఆనందాన్ని ప్రసాదిస్తాది.

# 13వ ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ మరియు
# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

| | | |
|---|---|---|
| తేదీలు | : | 1997 డిశంబరు 7 నుండి 12 వరకు<br>ఆదివారం నుండి శుక్రవారం వరకు |
| స్థలము | : | కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు<br>ఫోర్డ్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003. |
| ముఖ్యాంశము | : | "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" |
| **Theme** | : | **"Jesus Christ, the Son of God "** |

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవు చున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగముల నందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్థన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.

నెహెమ్యా గూటం
**Convenor of the Seminar**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 64882 / 72604.**

జాషువా గూటం
**Director of the Lectureship**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 63697 / 63722.**

# ఏషియన్ బైబిల్ లెక్చర్‌షిప్

డిశంబరులో జరుగబోవుచున్న ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ కు హాజరగుటకు అనేకులు సంసిద్ధతను వెల్లడి పర్చుచు ఉత్తరాలు వ్రాయుచున్నారు. వారందరికీ వ్యక్తిగతముగా జవాబు వ్రాయలేము గనుక ఈ పత్రికా ముఖముగానే సంప్రదించెదము.

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ప్రసంగించుటకుగాను కనీసం 10 దేశములలో నుండి గొప్ప సువార్తికులు వచ్చుచున్నారు. దానిలో హాజరు కావాలనుకొన్న వారికి భోజన వసతులు ఉచితముగానే లభింపచేయుటకు ప్రయత్నించుచున్నాము. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ భవన సముదాయము నందును. సత్యవాణి కార్యాలయము నందును వసతి ఏర్పరచబడును. రాను పోను ఖర్చులు ఎవరివి వారే భరించుకొన వలెను.

ఇంకా ప్రత్యేక వసతి వలయు వారు కాకినాడ పట్టణములో గల వివిధ లాడ్జింగ్‌లలో తమ స్వంత ఖర్చుల చొప్పున నివసించుచుండ వచ్చును. మేము కల్పించు ఉచిత వసలిని వినియోగించుకొనదలచిన వారు శీతాకాలమునకు తగినట్లు దుప్పటిని, బెడ్డింగ్ వగయిరా తెచ్చుకొనవలెను. లెక్చర్‌షిప్ సమయములో బైబిళ్లు, కీర్తన పుస్తకములు తగు మాత్రపు ధరకు విక్రయించబడును. మీ స్థానిక సంఘములనుండి చందాలు పోగుచేసి మీ దారి ఖర్చులకొరకు, లెక్చర్‌షిప్ ఖర్చుల కొరకు విరాళములు అందించ గలిగితే మంచిది.

ఈ సంచికతో సత్యవాక్కు తన 18వ యేట ప్రవేశించినదని తెలియ జేయుటకు సంతసించుచున్నాము. సత్యవాక్కులో ప్రచురించు నిమిత్తము మీ వ్యాసములు, గేయములు వగయిరా పంపించండి. సత్యవాక్కును, బేసిక్ బైబిలు కోర్సును మీ బంధువులకు మిత్రులకు పరిచయం చేయండి.

మీరు క్రీస్తు సంఘములో బోధకులైనను, కాకపోయినను, ఉద్యోగస్థులైనను, విద్యార్థులైనను, గృహిణులైనను కాకపోయినను **Basic Bible Course** లో చేరండి. క్రొత్త నిబంధన సత్యమును విపులముగా తెలుసుకొనండి. ఉచిత పాఠముల కొరకు ఈ రోజే దిగువ చిరునామాకు వ్రాయండి:

The Director
**Bible Correspondence Course**
P. O. Box.80, Kakinada - 533 001

---

**Printed matter - Book Post**

**To**

**From:**

**SATYA VANI**
P.o. Box 80
KAKINADA - 533 001